# కాగితం పువ్వులు

సులోచన రైలు దిగేసరికి బాగా ఆలస్యమైపోయింది. రావాల్సిన సమయానికి నాలుగు గంటలు లేటుగా వచ్చింది రైలు. సరిగ్గా పది గంటలకి సభ ప్రారంభమవు తుందని అక్కయ్య రాసిన ఉత్తరం పంపిన ఆహ్వాన పత్రం పదే పదే గుర్తు చేస్తున్నాయి.

సులోచన వాచీ చూసుకుంది. అరగంటే టైముంది. బ్యాగ్ తీసుకుని లేడీస్ వెయిటింగ్ రూంలోకి వెళ్ళి కాస్త నీట్‌గా తయారై, సరాసరి మీటింగ్ జరిగే హాలు దగ్గరికే బయలు దేరింది.

సులోచన అక్కయ్య మహాలక్ష్మి మామూలు భాషలో చెప్పాలంటే మహాసాధ్వి. ఆమె భర్త 'కన్నయ్య' పేరుతో కథలు రాసి మంచి పేరు ప్రఖ్యాతులు పొంది ఆరేళ్ళ క్రితం మరణించాడు. అతనికి మహాలక్ష్మి పాదదాసి పాత్ర పోషించి రాణించింది. సులో చనకి బావగారి గురించి ఆలోచన రాగానే మనసంతా ఏలాగో అయిపోయింది. అక్కయ్య మహాలక్ష్మిని తలుచుకుంటే జాలి, కోపం, విసుగూ లాంటి ఎన్నో భావాలు కలగాపులగంగా మనసును పాడుచేస్తాయి ఎప్పుడూ.

భర్తని రచయిత అనో, కవి అనో అర్థం చేసుకుని, అతని ఆలోచనలు పంచుకో గల చదువు, తెలివిగల స్త్రీ కాదు మహాలక్ష్మి. చాలా సాదాసీదా పదహారణాల పాతకాలపు పల్లెటూరి అమ్మాయి. అయినా అందరూ తన భర్తను పొగుడుతూ, అందలం ఎక్కిస్తుంటే ఆనందపడిపోయేది. పొంగిపోయేది. అతను మాత్రం ఆమె ఒక అవసరానికి పనికొచ్చే ఆడమనిషిగా, ఇంట్లో అత్తమామలకి సేవలు చేస్తూ ఎప్పుడూ ఇంట్లో చాకిరికి అంకితమైపోయిన పని మనిషిగానే గుర్తించాడు. ఆమె అలాగే మిగిలి పోయింది. అదే తన స్థానమని భావించిందేగానీ మరేం ఆశించలేదు. మగవాడిగా, అందులో రచయితగా ఈ సమాజం అతనికి చాలా హక్కులే ఇచ్చింది. అసలే మగాడేం చేసినా ఫరవాలేదనే ఈ సంఘంలో పైగా రచయిత, కవి అయితే ఇంక చెప్పేదేముంది? అతను అందరి లాంటి వాడు కాదు. అందరి కంటే చాలా పై స్థాయిలో ఉన్నవాడు అని అందరూ ఒప్పేసుకున్న విషయం. అందుకే అతను విచ్చల విడిగా తిరిగాడు.

అమాయకంగా భర్తనే ప్రేమిస్తూ అతన్నే నమ్ముకుని ఉన్న అందమైన భార్య. మహాలక్ష్మికి ఇదంతా బాగానే ఉండేది. కానీ ఏం చెయ్యాలో తెలీని అమాయకత్వం ఆమె నావహించి ఉండేది. అతను రాసే కథలు పత్రికలలో ప్రచురింపబడి అతనికి పేరు ప్రఖ్యాతులు పెరుగుతుంటే ఆనందించాలో, అతని నిజ జీవిత కథలు మిత్రుల ద్వారా ఆమెకి చేరుతుంటే బాధపడాలో అర్థమయ్యేది కాదు. ఆమె తల్లీ, తండ్రీ ఒక్కటే మాట చెప్పేవారు.

'అతను మగవాడు, అతను మారేవరకు ఓర్పు వహించటం, స్త్రీగా, భార్యగా నీ కర్తవ్యం. అదే మన సంప్రదాయం. అంతేగానీ అల్లరి చేసుకుంటే నీకే నష్టం' అని బోధించేవారు. ఆ సమయంలో ఒక్క సులోచన అక్కయ్యకి అంతరంగికురాలైంది. అక్కయ్య బాధ ఓర్పుగా వినేది. అర్థం చేసుకునేది. కానీ అక్కయ్యలో ఉన్న మెతక తనం, భయం ఆమెకి నచ్చేవి కావు. ఖండిస్తూ ఉండేది.

'నువ్వు తిరగబడాలక్కా - నువ్వు ఎదరించాలి' అనేది.

'అమ్మో ఇంకేమైనా ఉందా ? ఆయనికి కోపమొస్తే, మెడపట్టి గెంటేస్తే ? నీకేం నువ్వు చదువుకున్న దానివి, స్వతంత్రంగా నైనా బతక గలవు'' అంటూ నిట్టూర్చేది అక్క.

★ ★ ★ ★

ఆనాటి దృశ్యం సులోచనకి ఇప్పటికీ కళ్ళకు కట్టినట్టుగా ఉంటుంది. కొంత మంది ఈ మహానుభావుడికి గిట్టని వాళ్ళు ఒక అమ్మాయితో అతనుండగా బయట గడియ పెట్టి నానా అల్లరి చేసి పరువుతీసి పందిరేశారు. ఆనాడు ఇంట్లో అందరూ అవమానంతో కృంగి పోయారు.

ఇన్నాళ్ళూ దర్జాగా సాగుతున్నదనుకున్న వ్యవహారం అవమానాలు తెచ్చి పెట్టే సరికి కన్నయ్యకి కంగారు పుట్టింది. కనువిప్పు కలిగిందనలేము గానీ బతుకు కలత పడిపోయిన మాట మాత్రం నిజం. ఆ అవమానంతో అనారోగ్యం చేసింది. మంచాన పడ్డాడు. మామూలుగా మహాలక్ష్మి రాత్రులు నిద్రకాసింది. పగళ్ళు పూజలు చేసింది. వెరసి అతను కోలుకునే వరకూ సేవలు చేసింది.

''నీకు నలభై ఏళ్ళు వచ్చేవరకూ ఏ సుఖమూ, శాంతీ లేకుండా చేసిన భర్తకి నువ్విప్పుడెందుకు సేవలు చేయ్యాలి ? వదిలేసి నీ దారిన నువ్వు బతుకు'' అంది సులోచన.

మళ్ళీ మహాలక్ష్మి ఆలోచనలో పడి, తేరుకుని ''పోనిస్తూ, రాత్రి నిద్ర పోయేటప్పుడు పక్కనే కూర్చుని ఉన్న నా చేతిని తన చేతిలోకి తీసుకుని గుండెల కదుముకుని నిద్రపోవడం చూస్తే అతన్ని నేనెలా వదలను అనిపిస్తుంది. నేనంటేనూ ఆయనకి ఇష్టమే ననిపిస్తుంది'' అంది.

''అశక్తులై, అనారోగ్యులై, అవస్థల పాలైనప్పుడు ప్రతి మగాడికి భార్య అవసరం బాగా వస్తుంది. మరి ఇన్నాళ్ళూ నువ్వు అసహాయురాలిగా ఉన్నప్పుడు నీకా చెయ్యి అసరా యిచ్చిందా ?''

మహాలక్ష్మి మాట్లాడలేదు.

అంత గొడవ జరిగి అల్లరి పాలైనప్పుడు కూడా నీ దగ్గర బావ తన తప్పు ఒప్పుకో లేదు. పైగా ఏమన్నాడో నీకు గుర్తు లేదేమో నాకు వెంటనే చెప్పావు కనుక బాగా గుర్తుంది.

అందరూ ఏమన్నా నువ్వు మాత్రం ఆ అమ్మాయిని వదిలేయమని అడగకు లక్ష్మి అన్నాడా లేదా?'' సులోచన నిలదీసింది.

మహాలక్ష్మి బేలగా చూసి తలదించుకుంది. కొంచెమాగి

''మరేం చెయ్యను?''

''నిజాన్ని గ్రహించు, అతనికొచ్చిన అవమానం వల్ల అతను నీ ఆశ్రయంలోకి వచ్చాడు గానీ నీకు అన్యాయం జరిగిందనే పశ్చాత్తాపం వల్ల కాదు''

ఒక అబద్ధాన్ని నిజమనే భ్రమని సృష్టించుకుని దానినే నమ్ముతూ, మననం చేసుకుంటూ దాని చుట్టూ పరిభ్రమిస్తూ అందులోనే బతికేస్తే కొన్నాళ్ళకది నిజమే ననిపిస్తుంది. నిజానికి అబద్ధానికి మధ్యనున్న సున్నితమైన రేఖ అలుక్కుపోతుంది. మనం చేసుకునే మోసమే మనకి మిగులుతుంది.

ఆ తర్వాత సులోచన బావ పోయినప్పుడే అక్కయ్యని కలిసింది. అప్పుడు పలకరింపులు, ఓదార్పులు సాగాయి. అందరిలాగే మహాలక్ష్మి రోదించింది. తను ఒంటరి దైందని, తన పసుపు కుంకాలు గంగపాలయ్యాయని ఏడుస్తూ నలుగురి ఓదార్పును సానుభూతిని పొందింది. ఆ సమయంలో సులోచన అక్కయ్యతో మరే మాటా మాట్లాడ లేదు. అంతరంగంలో ఏముందో ఎవరికీ కనిపించకుండా నలుగురూ కోరే విధంగా నడుచుకునే శక్తి మనిషికి సహజంగానే ఉంటుంది. అయితే అలా నటించగా, నటించగా

అంతరంగం చచ్చిపోతుంది. అది చచ్చి పోయిందని గ్రహించే సమయానికి కాలం చెల్లుతుంది.

సభ జరుగుతున్న హాలుకి కాస్త దూరంలో రిక్షా దిగి నెమ్మదిగా నడిచి, చివరి వరుసలో కూర్చుంది సులోచన. ముసలితనం మీదపడినా, ఉండాల్సిన బొట్టూ, కాటుక లేకపోయినా విశాలమైన కళ్ళతో సూటైన ముక్కుతో తెల్లగా మహాలక్ష్మి అందంగానే కనిపించింది సులోచనకి. అలవాటు లేనమ్మ కట్టుకున్నట్లుగానే ఉంది ఖరీదైన పట్టుచీర.

కార్యక్రమం సాగుతోంది. పుస్తకావిష్కరణ, బహుమతి ప్రదానం, ఇలా... ఇలా...

మైకు ముందు నిలబడిన వక్త ఉపన్యాసం మొదలు పెట్టాడు. ''కన్నయ్యగారు సౌందర్యోపాసకుడు, సౌందర్యారాధకుడు. అందం ఎక్కడ ఉన్నా అది ఆయన దృష్టి నుండి తప్పించుకు పోలేదు. ఆయన అందాన్ని అంటిపెట్టుకుని ఉంటాడు. ఆనందాన్ని కౌగిలించుకునే ఉంటాడు. ఆయన ఎప్పుడూ నలగని పువ్వులా, చెరగని నవ్వులా ఉంటాడు. ఆ వ్యక్తిత్వం చాలా తక్కువ మంది కుంటుంది. ఆయన ధీర గంభీరుడు, ఉపన్యాసం సాగుతోంది...

ఆయన రచనల్లోని గొప్పతనం చెప్పినా ఫరవాలేదు గానీ ఈ పొగడ్తలను వినడం కష్టమైంది సులోచనకి. మరో వక్త మరీ ముందుకెళ్ళి 'ఆయన కథల్లో అందమైన అమ్మాయంటే అది ఖచ్చితంగా మహాలక్ష్మిగారి రూప కల్పనే. ఆయన భార్యను ప్రేమించినట్లు బహుశా ఎవరూ ప్రేమించరు...''

ఇలా సాగుతున్న మాటలు వింటుంటే చెవులు మూసుకోవాలనిపించింది సులోచనకి. ఈ లోకమంతా ఎంత హిపోక్రసీ, ఎంత అసత్య ప్రేలాపన. ఎంత నటన, చచ్చిన వాడి కళ్ళు చారడేసి.. నిజమే.. అది మగాడైతే మరీ చాటలంతేసి కామోసు..

ఎప్పుడో పోయిన రచయితన్నే మళ్ళీ బతికించి నడిపిస్తున్నందుకు అందరూ నిర్వాహకుల్ని ప్రశంసించారు. నిజానికి 'కన్నయ్య'గా బావగారు రాసిన రచనలు ఎప్పుడూ బతికే ఉన్నాయి. ఉంటాయి. వ్యక్తిగా ఎలా ఉన్నా అతను ప్రతిభావంతుడైన రచయిత. ఆ మాట ఎవరూ కాదనలేరు''.

రాత్రి ప్రయాణంలో నిద్రలేని సులోచనకి మత్తుగా, మగతగా ఉంది. కళ్ళు తెలీయకుండా మూతలు పడుతున్నాయి. స్వప్నగృహద్వారాలు వాటంతటవే నెమ్మదిగా తెరుచుకుంటున్నాయి. ఎవరో ఒక రాట పాతి దానికి తీగెలు చుట్టి, పూలు పూయించి,

పరిమళం కోసం సెంటుజల్లి గాలిలోకి ఎగుర వేస్తుంటే రంగురంగుల పూలు చెట్ల మీంచి గాలిలో తేలుతూ ఎగిరి పోతున్నాయి. తను ఒక్క పువ్వునైనా పట్టుకుందామని, ఆ వింత సోయగాల్ని స్పృశిద్దామని పరుగెడుతోంది. ఒక్కటీ అందకుండా పోతున్నాయి. ఆశ చావక పరుగెట్టి పరుగెట్టి అలసి తూలిపడబోయి అంతలోనే చేతికందిన ఒక్క పువ్వును ఆత్రంగా పట్టి చూస్తే.. తీరా అది కాగితం పువ్వు.

సులోచన చప్పట్ల ధ్వనికి ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది. అప్పుడే మహాలక్ష్మి మైకు ముందుకొచ్చి

''ఆయన భార్య కావడం నా జన్మ జన్మల భాగ్యంగా భావిస్తున్నాను. ఇంతకంటే నేనేం మాట్లాడలేను'' అంటూ నమస్కరించింది.

కరతాళ ధ్వనుల మధ్య నుంచి కలతబడిన మనసుతో సులోచన ఉన్నదానికీ, అనుకున్నదానికీ ఎంత చేరువో అది అంత దూరము అన్న కవిగారి మాటలు గుర్తు చేసుకుంటూ అక్కగార్ని పలకరించేందుకు వేదిక వైపు కదిలింది.

ఆంధ్రభూమి - ప్రియదర్శిని
జనవరి 24, 1998